# ధర్మపురి క్షేత్ర మహత్యము.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రములలోని నవనారసింహ క్షేత్రాలలో **ధర్మపురి శ్రీయోగనంద లక్ష్మీ నృసింహ స్వామి వారి క్షేత్రము ఒకటిగా వెలుగొందుచున్నది.** ఈ క్షేత్రమును పూర్వం "ధర్మవర్మ" అనే మహరాజు పరిపాలించుటచే ఈ క్షేత్రానికి "ధర్మపురి" అనే పేరు వచ్చినది. ఇట్టి క్షేత్రము క్రీ॥శ॥850-928 సంవత్సరము కాలమున కంటె పూర్వముదే అయినప్పటికి క్రీ॥శ॥ 1422-1436 సంవత్సరముల కాలములో బహుమనీ సుల్తానుల దండయాత్రలో ధ్వంసమై తిరిగి 17 వ శతాబ్దంలో ఈ ఆలయము పునరుద్ధరింపబడినట్లు క్షేత్ర చరిత్ర ఆధారముగా తెలియుచున్నది. ఈ క్షేత్రములో ప్రధాన దేవత అయిన శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వామి వారు సాలగ్రామ శిలగా వెలసియున్నారు. ఈ క్షేత్రమునకు అనుకొని పవిత్ర గోదావరి నది **దక్షిణ వాహినిగా** ప్రవహించుచున్నందున ఈ క్షేత్రము **దక్షిణ కాశీగా** మరియు తీర్థరాజముగా, హరిహర క్షేత్రముగా మరియు ఈ క్షేత్రములో శ్రీ బ్రహ్మ దేవుడు, విష్ణు స్వరూపుడైన శ్రీ నరసింహస్వామి మరియు శ్రీ రామలింగేశ్వరస్వామి వారల ఆలయములు కలవు. **బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు** ముగ్గురు కొలువైన క్షేత్రము కనుక ఈ క్షేత్రము **త్రిమూర్తి క్షేత్రమని** కూడ పిలువబడుచున్నది. **ఈ ఆలయ ప్రాంగణములో భారత దేశములో ఎక్కడాలేని విధంగా శ్రీ యమధర్మరాజు వారి ఆలయము కూడా కలదు. "ధర్మపురికి వచ్చిన వారికి యమపురి ఉండదు" అనే నానుడి కలదు.** ఈ ఆలయ ప్రాంగణములో ప్రధాన దేవాలయముతో పాటు శ్రీ వేంకటేశ్వరస్వామి , శ్రీ ఉగ్ర నరసింహస్వామి , శ్రీ ఆంజనేయస్వామి , శ్రీ వేణుగోపాలస్వామి , శ్రీయమధర్మరాజు , శ్రీరామలింగేశ్వరస్వామి మరియు శ్రీ సంకష్ట వినాయకస్వామి వారల ఆలయములు కలవు.

ఇట్టి క్షేత్రము ప్రాచీన పుణక్షేత్రముగా, చారిత్రాత్మకముగా మిక్కిలి ప్రసిద్ధి గాంచినది. ఈ ధర్మపురి క్షేత్రము వేదములకు, ప్రాచీన సంస్కృతికి, సంగీతానికి, సాహిత్యానికి, కవిత్వానికి పుట్టినిల్లుగా ప్రసిద్ధి గాంచినది. ఈ ధర్మపురి క్షేత్రములో బ్రహ్మపుష్కరిణితో పాటు ఇంకను ఆనేకమైన ప్రాచీన దేవాలయములు కలవు. ఈ క్షేత్రము నందు సత్యవతి ఆలయము (ఇసుక స్తంభం)నకు చాలా ప్రాశస్త్యము కలదు. మరియు ఈ క్షేత్రము నందు ప్రవహిస్తున్న గోదావరి నదిలో బ్రహ్మగుండం, సత్యవతి గుండము, యమగుండం, పాలగుండములు చక్రగుండం కలవు. మరియు ఈక్షేత్రము నందు గోదావరి నది "దక్షిణ దిశగా ప్రవహించుచున్నందున ఇట్టి క్షేత్రమునకు భక్తులు మూడు పర్యాయములు వచ్చి దక్షిణ వాహినిగా ప్రవహిస్తున్న గోదావరిలో స్నానమాచరించి శ్రీస్వామి వారిని దర్శించినచో మూడు జన్మలలో చేసిన పావములు తొలుగునని శ్రీ దత్తాత్రేయ పురాణములో" కలదు. కావున భక్తులు ఈ క్షేత్రములోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొన్నచో మానసిక, శారీరక ఋణ బాధల నుండియే గాక ఆయురారోగ్యములు అష్ట ఐశ్వర్యములు ప్రసాదించునని భక్తులకు అపారమైన నమ్మకము.

ఈ దివ్య క్షేత్రములో **శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవములు ప్రతి సంవత్సరము పాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి 13 రోజులపాటు అత్యంత వైభవముగా నిర్వహించబడుతాయి.** ఆదే విధంగా ప్రతి సంవత్సరము వైశాఖ మాసములో 9 రోజులు శ్రీ నృసింహ జయంతి ఉత్సవముతో పాటు ధనుర్మాసములో ముక్కోటి ఏకాదశి ఉత్సవము అత్యంత వైభవముగా జరుగును. మరియు ప్రతి 12 సంవత్సరములకు ఒకమారు గోదావరి పుష్కరములు జరుగును.